క్లుప్తంగా

నేటి నుంచి సమ్మె

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. గురువారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ సమ్మెను చేపట్టనున్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన



మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడ గ్రామంలో సర్పంచ్ యశోద ఆధ్వర్యంలో రూ.10 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్, జెడ్పీటీసీ బింగిదాసుగౌడ్, వైఎస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డితోకలిసి సర్పంచ్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు గౌస్ పాషా, ఉప సర్పంచ్ అచ్చిలేశ్‌గౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, లింగస్వామి, నాయకులు ధనుంజయ్యగౌడ్, శ్రీకాంత్, అశోక్, కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూకు భలే డిమాండ్



కర్ణంగూడలో వినాయకుని లడ్డూతో నవీన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కర్ణంగూడ గ్రామంలోని శ్రీ ఆంజనేయ భజన మండలి నెలకొల్పిన గణేశ్ మండపం వద్ద బుధవారం లడ్డూ వేలం నిర్వహించారు. వేలం పాటలో రూ.1,22,000 వేలకు నవీన్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే ఇబ్రహీంపట్నంలోని శ్రీ ఈశ్వరాంజనేయ స్వామి ఆలయంలోని వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని రూ.31,500లకు మహేశ్‌గౌడ్ స్వాధీనం చేసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న హరిత

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి 24వ వార్డు సాయి ప్రియా కాలనీ ఫేజ్-1, ఫేజ్-2లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లను మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుతో లో ఓల్టేజి సమస్య పరిష్కారం కానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, మున్యా నాయక్, ప్రధాన కార్యదర్శులు లక్పతి నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు ఘనస్వాగతం



ఈటలకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు బుధవారం బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులను పరామర్శించడానికి నాగర్‌కర్నూల్ వెళుతున్న ఈటలకు ఆమనగల్లు పట్టణంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భాస్కరాచారి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడిగా భాస్కరాచారి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఏ, బీ బ్లాక్ అధ్యక్షుల నియామకంలో భాగంగా పీసీసీ రాష్ట్ర కమిటీ విడుదల చేసిన జాబితాలో భాస్కరాచారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఎంఆర్ఆర్ యువసేనఅధ్యక్షుడిగా పనిచేసిన భాస్కరాచారిని బీ బ్లాక్ అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో పనిచేస్తానని ప్రకటించారు.

లక్ష్యంతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు

నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్
- రోడ్లుపై అవస్థలుపడుతున్న చిరు వ్యాపారులు
- వినియోగంలోకి తేవాలంటున్న స్థానికులు



నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

కడ్తాల్: లక్షలాది రూపాయలను ఖర్చు చేసి షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. కానీ వాటిని కేటాయించకపోవడంతో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. లక్ష్యంతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు కేంద్రం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయి ఏడాది కావొస్తున్నా ఇంతవరకు ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. 2022 జనవరిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ భూమారెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. నిర్మాణ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి కావడంతో చిరువ్యాపారులు, నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆశలపై నీళ్లు

షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు అద్దెకు తీసుకుని ఉపాధి పొందుదామని ఆశగా ఎదురుచూస్తున్న యువకులు, నిరుద్యోగులు, చిరువ్యాపారులు భవనాలు ప్రారంభించక పోవడంతో నిరాశ చెందుతున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

త్వరగా ప్రారంభించాలి

మండల కేంద్రం కావడంతో ప్రజల రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వ్యాపారాలు కూడా బాగానే సాగుతున్నాయి. కొందరు ప్రైవేట్ భవనాలను ఆశ్రయించి వ్యాపారం చేసుకుంటున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ప్రభుత్వం వ్యాపార సముదాయాన్ని ప్రారంభిస్తే సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు. ఆరేళ్ల క్రితం శ్రీశైలం–హైదరాబాద్ రోడ్డు విస్తరణతో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న చిరు దుకాణాలను అధికారులు తొలగించారు. దీంతో 50 కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే లోపు షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఎన్నో సంవత్సరాలుగా రోడ్ల పక్కన బండ్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నాం. మండల కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఏడాది కావొస్తుంది. ఇప్పటివరకు ప్రారంభించక పోవడంతో రోడ్లపై వ్యాపారం చేసుకుంటూ అనేక ఇబ్బందులు పడుతున్నాం. భవనాలు ప్రారంభిస్తే నా లాంటి చిరు వ్యాపారులు ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.

– నర్సింహ, టిఫిన్‌సెంటర్, కడ్తాల్

ప్రాధాన్యం కల్పించాలి



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి.. వినియోగంలోకి తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధితో పాటు, పాలశీతలీకరణ కేంద్రానికి ఆదాయం సమకూరుతుంది. సంవత్సరాలుగా పాల కేంద్ర ఆవరణలో వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ వ్యాపారా లు చేసుకుంటున్న వారికి ప్రాధాన్యత కల్పించాలి.

– లింగం, చిరువ్యాపారి, కడ్తాల్

త్వరలో ప్రారంభం



షాపింగ్ కాంప్లెక్స్ భవనం నిర్మాణం పూర్తయిన మాట వాస్తవమే. రోడ్లు భవనాల శాఖ అధికారులు పదిహేను రోజుల క్రితం షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని పరిశీలించారు. భవనాల అద్దెను నిర్ణయించి, త్వరలోనే సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు టెండర్ ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది.

– రాధిక, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్, కడ్తాల్

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోండి

ఎంపీపీ సుకన్య

యాచారం: వినాయక నిమజ్జనాన్ని మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎంపీపీ సుకన్య పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిమజ్జనాల ఊరేగింపు, ర్యాలీల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన కార్యక్రమాల్లో పోలీసుల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

బాధితుడికి పరామర్శ



శేఖర్‌ను పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

చెత్తతో సంపద సృష్టించవచ్చు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



తుర్కయంజాల్: వ్యాస రచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తుర్కయంజాల్: చెత్తతో సంపదను సృష్టించవచ్చని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023, ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని, ఇళ్లలో వెలువడే చెత్తను బహిరంగంగా పారేయకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తతో సంపదను సృష్టించడం ఎలా అనే అంశంపై వ్యాస రచన, చెత్తలోని రకాలు అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

తుర్కయంజాల్: వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయించాలని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ కోరారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని మహిళా సంఘాల టౌన్ లెవల్ ఫెడరేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, వ్యాపారుల సమన్వయంతో ముందుకు పోవాలని సూచించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



ఇబ్రహీంపట్నంలో వంటావార్పు చేస్తున్న అంగన్‌వాడీలు

ఇబ్రహీంపట్నం: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ రాములు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేదిలేదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలకు రూ.26 వేల వేతనం ఇవ్వడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నర్సింహ, అంగన్‌వాడీ టీచర్లు గీత, బాలమణి, అహల్య, శోభ, వనజ, సువర్ణ, లక్ష్మి, అండాలు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

17వ రోజుకు చేరుకున్న సమ్మె

ఆమనగల్లు: సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీల ఉద్యమానికి లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, ప్రజాసంఘాల నాయకుడు వెంకటయ్య సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనసూయమ్మ, పద్మ, రాజ్యలక్ష్మి, సంధ్య, పద్మ, స్వరూప, సువర్ణ, అంజమ్మ, అలివేలు, యాదమ్మ, జ్యోతి, కళావతి, విమల పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ తదితరులు

కడ్తాల్: సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ హెచ్చరించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిండా ముంచిందని, ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మాయా మాటలతో కాలం గడిపారని విమర్శించారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బీక్యానాయక్, రామకృష్ణ, లక్ష్మయ్య, అశోక్, జహంగీర్‌బాబా, శ్రీను, రాజేశ్, రాజేందర్, భరత్, షాబుద్దీన్, మహేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

విద్యకు పేదరికం అడ్డు కాకూడదు

కడ్తాల్: పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో విద్యకు దూరం కావొద్దని కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన సాక్షి అనే విద్యార్థికి రాఘవేందర్‌రెడ్డి రూ.20 వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

4న ఓటర్ల తుది జాబితా

ఆర్డీఓ అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: అక్టోబర్ 4వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామని ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న జాబితా ఓటర్లలో డబుల్ ఓట్లు, దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లుంటే గుర్తించి తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, సీపీఐ నాయకులు హాజరయ్యారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు, యువత భాగస్వామ్యులు కావాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటి పర్యావరణ ఇంజినీర్ ప్రణవ్ అన్నారు. స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో తడి పోడి చెత్తను వేరు చేయాలన్నారు. ఇష్టానుసారంగా చెత్తను, ప్లాస్టిక్ కవర్స్, వ్యర్థ పదార్థాలను పడేయొద్దన్నారు.

విజయవంతమైన వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్య సహాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 66 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 43 మందిని ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండలోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, ఎస్ఐ బాల్‌రాం, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి వెంకటయ్య, జిల్లా చైర్మన్‌లు యాదయ్య, రమేశ్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాషా, సుదీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న యువకుడితో ప్రజాప్రతినిధులు, అధికారులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: రక్తదాతలు ప్రాణదాతలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. రక్తదానం చేయడంపై ప్రజల్లో ఉన్న అపోహలను వీడాలని, రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపాలిటీ, పోలీసుశాఖ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 41 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతీ, యువకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అంతకుముందు జరిగిన సమావేశంలో రాంపాల్‌నాయక్, సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానంపై ఉన్న అపోహలు వీడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం వల్ల రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని వారు అన్నారు. ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్యానికి గురికారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, శ్రీకాంత్‌సింగ్, శేఖర్, ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి వెంకటయ్య, పీఆర్ఓ పాషా, సభ్యులు యాదయ్య, ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రి వైద్యుడు నరేందర్ పాల్గొన్నారు.

'ఆశా'ల పోరుబాట



ఆమనగల్లులో సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆమనగల్లు: ఆశ కార్యకర్తలు పోరుబాట పట్టారు. నెల నెలా ఇస్తున్న పారితోషకం వద్దని ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని నిరవధిక సమ్మెకు దిగారు. ఆమనగల్లు పట్టణంలో ఆశ కార్యకర్తల సమ్మె కొనసాగుతోంది. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో బుధవారం ఆశ కార్యకర్తలు నిరసన దీక్ష చేపట్టారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకుడు కురుమయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు పారితోషికాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ సమ్మెలో ఆశ కార్యకర్తలు సల్మాబీబీ, అలివేలు, నిర్మల, అనిత, మంజుల, విజయ, స్వరూప, సక్కుబాయి, గౌరి, సంతోష, వరలక్ష్మి, లలిత తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు సమ్మెకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న సమ్మెలు

యాచారం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్ల సమ్మె కొనసాగుతోంది. సీఐటీ యూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్ సమ్మె లకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం



భైరాన్‌ఖాన్ చెరువు వద్ద క్రేన్లు

అబ్దుల్లాపూర్‌మెట్: వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే నిమజ్జనోత్సవాలకు నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామ పంచాయతీలో గల భైరాన్‌ఖాన్ చెరువు వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నాలుగేళ్లుగా ఈ చెరువులో వినాయక నిమజ్జనాల సంఖ్య పెరుగుతుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మండలంలోని గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాలు, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, చింతల్‌కుంట, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట ప్రాంతాల నుంచి వేలాదిగా వినాయక ప్రతిమలు ఇక్కడ నిమజ్జనానికి తరలివస్తుండడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. నిమజ్జనం కోసం 3 క్రేన్లు, 2 జేసీబీలు, పోలీసు సహాయ కేంద్రాలు, సీసీ కెమెరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భైరాన్‌ఖాన్ చెరువు వద్ద ఏర్పాటు చేశారు.

గంగమ్మ ఒడికి గణపయ్య

నవరాత్రుల పూజలందుకొని గణనాథులు గంగమ్మ ఒడికి బయలుదేరారు. కోలాటాలు, మంగళహారతులతో నిమజ్జనోత్సవానికి బయల్దేరిన వినాయకులను మహిళలు వాడవాడలా ఎదురేగి సాగనంపారు. భారీ ఏర్పాట్ల మధ్య శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. చెరువులు, కుంటల్లో నిమజ్జనాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం: పట్టణంలో గణనాథుని ఊరేగింపు



ఆమనగల్లు: వినాయకుడికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు ఆచారి



పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ తదితరులు



ఇబ్రహీంపట్నం: నిమజ్జనానికి ముందు వినాయకుడికి పూజలు

ఘనంగా కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి



కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆచార్య కొండ లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలను పద్మశాలీ సంఘం, పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలోని కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పద్మశాలీసంఘం అధ్యక్షుడు బాలకృష్ణ, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు రవి, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ఎస్ఐ బాల్‌రాం, పద్మశాలీ సంఘం నాయకులు శ్రీను, శివలింగం, రవి, వెంకటేశ్, శ్రీను, కిష్టయ్య, లింగం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.